మినీకథ

# జాలిగుండె

జి. ఉషావిశాల్

నాది అసలే జాలిగుండె! ఎవరైనా కష్టంలో వున్నారంటే భరించలేకపోయేదాన్ని! ఏడ్చే వాళ్లతో ఏడ్చేసేదాన్ని! నా చిన్నతనంలో ముష్టివాళ్లని మా ఇంట్లో వాళ్లెవరైనా కసిరి కొడితే నన్నే కసిరినంత బాధ పడిపోయి కళ్లనీళ్లు పెట్టుకునేదాన్ని! అంత దాకా ఎందుకూ, ఇంట్లో వాళ్లు ఏ కాయ గూరలు అమ్ముకునేవాళ్లనో పిలిచి, బేరా లాడి చివరికి కొనకుండా పంపించేస్తే, ఆ అమ్ముకునేవాళ్ల కళ్లల్లో మెదిలో నిరాశ లాంటి భావం చూసి నా మనసు గిల గిల్లాడిపోయేది. ''మా పిల్లది మరీ మెత్తని మనసమ్మా! ఎలా బ్రతుకుతుందో ఏమో!'' అంటూ వుండేది మా అమ్మ. నా కొడుకైతే-

''అమ్మా! నీ జాలి గుండె ధర్మమా అని అందరూ మనిని ముంచేస్తున్నారు. పనిమనిషి అందరిళ్లకీ వచ్చినట్టు వస్తుంది. నాగా పెట్టినా నువ్వేమీ అనవని మనింటికి అస్తమానం ఎగవేస్తూ వుంటుంది. ఆ కూరల బండివాడు చచ్చువీ, పుచ్చువీ బోలెడంత ధరకి నీకు అంటగట్టిపోతాడు. ముష్టివాళ్లు సరేసరి! నీ సంగతి తెలిసి గుమ్మం వదలరు. ఈ కలికాలంలో నీలాంటివాళ్లు బ్రతకడం కష్టం అమ్మా!'' అంటూ లెక్చరిస్తాడు. ఏమిటో వెర్రి నాగన్న! నేను ఈ కాలంలో బ్రతకడం కష్టం అంటాడు. ఇలాగే అరవై ఏళ్లు బ్రతికేశానా? ఇంకా నాకు కష్టం ఏమిటి? మొన్నటికి మొన్న ఓ ఆసామి తలుపుతట్టి,

''నమస్కారం మామ్మగారూ!'' అంటూ వినయంగా దండం పెట్టాడు. నాకు ముచ్చటేసింది. నేను నోరు తెరిచేలోపల నా చేతిలో ఓ కాగితం పెట్టి,

''ఈ 'చెప్పు' గుర్తుకే మీ ఓటు వెయ్యండి! ఈ మనవడిని మరిచిపోకండి మామ్మగారూ!'' అంటూ పదే పదే చెప్పి వెళ్లాడు. అబ్బ కాలచక్రం ఎలా తిరిగిపోతోందో! మొన్న మొన్న ఓట్లు వేసినట్టుంది. అప్పుడే ఓట్లంటూ మళ్లీ వచ్చేశారు అనుకుంటూ ఆ కాగితం జాగ్రత్త చేశాను. సాయంత్రం మావాడు ఆఫీసు నుంచి రాగానే ఆ కాగితం చూపించాను. వాడు,

''అరే! 'చెప్పు' గుర్తువాళ్ళు అప్పుడే కేన్వాసింగ్ మొదలుపెట్టేశారన్నమాట! ఏమైనా మనం 'గోడ మీద పిల్లి' గుర్తువాళ్లకే ఓటు వెయ్యాలమ్మా! ఆ పార్టీ చాలా మంచిది.'' అన్నాడు. వాడి మాటలు నాకేం రుచించలా! 'గోడమీద పిల్లి' గుర్తు వాళ్లు మనని అడిగారా పెట్టారా, వాళ్లకి ఓటు వెయ్యడానికి! 'చెప్పు' గుర్తు అతను పాపం ఎంత వినయంగా అడిగాడూ! నా ఓటు ఏమైనా 'చెప్పు' గుర్తుకే వెయ్యదలుచుకున్నాను. ఆ మాట మా వాడితో చెప్పదలచుకోలేదు. ఇరుగమ్మా, పొరుగమ్మా పోలింగ్ బూత్ దాకా నడవడానికి బద్ధకించి ఓటు వెయ్యడానికి రాకపోయినా నేను మాత్రం ''ఓటు మన హక్కు! దాన్ని వినియోగపరచుకోవాలి!'' అన్న మా వారి మాటలు జ్ఞాపకం పెట్టుకుని ప్రతీసారి ఓటు వేస్తూనే వున్నాను. ఈసారి మావాడు,

''అమ్మా! నువ్వు అంతదూరం నడవలేవు'' అంటూ ఎవరిదో స్నేహితుడి స్కూటరు తెచ్చాడు. దానిమీద వెళ్లి ఆ స్కూలు దగ్గర ఇలా దిగేనో లేదో, చాకులాంటి కుర్రాడొకడు పరిగెత్తుకుంటూ వచ్చి,

''అమ్మమ్మగారూ! మీ ఓటు 'గులాబీ' గుర్తుకే '' అంటూ నా చేతిలో ఓ కాగితం కుక్కేడు. మా వాడు స్కూటర్ని నీడలో పెట్టి వచ్చేలోపుల ''చేపగుర్తు'కి మీ ఓటు వెయ్యండి పిన్నిగారూ!'' అంటూ మరో నడి వయసు పెద్దమనిషి నాకు అడ్డం పడ్డాడు. ఎలాగో అందర్నీ తప్పించుకు వెళ్లి, ' చూశారా! మీరు చెప్పినట్టు నా హక్కుని నేను వినియోగించుకుంటున్నాను ' అంటూ మా వార్ని తలుచుకుని ఓటు వేసేశాను. ఇంటికి వచ్చాక మావాడు.

''అమ్మా! 'గోడమీద పిల్లి' గుర్తుకే వేశావు కదూ!'' అని అడిగాడు.

''వేశానురా! పాపం 'చెప్పు' గుర్తాయన మరీ మరీ అడిగాడేమో, ఆయనికీ వేశాను. ఆ కుర్ర సన్నాసి, ' మా పార్టీని గెలిపించరా అమ్మమ్మగారూ? ఈ పార్టీ గెలిస్తే మాలాంటి పేద కుర్రాళ్లకి మరో నాలుగు డబ్బులు ముడతాయి 'అంటూ కాళ్లకి అడ్డం పడ్డట్టయి, 'గులాబీ గుర్తు'కీ వేశాను. ఏమిటో! ఎవళ్ళనీ నిరాశ పరచలేని జాలిగుండె నాది! ఇప్పుడే కాదు. ప్రతీసారి నేను అడిగిన వాళ్లకి లేదనకుండా ఓటు వేస్తూనే వున్నాను. పాపం! ఈ ఎలక్షన్ల కోసం బోలెడేసి డబ్బులు పోస్తారట మరి!'' అన్నాను. మావాడెందుకో,

''అంటే అన్ని గుర్తుల మీద ముద్రలు గుద్దేశావన్న మాట! మంచి అమ్మవే!'' అంటూ నవ్వడం మొదలు పెట్టాడు.

